# గొలుసు కథ

వసంత అద్దంలో చూసుకుంది. ఎప్పటిలాగానే తన అందానికి మురిసి పోయింది. మెరుగు పెట్టినట్లుండే పచ్చటి శరీరపు రంగు, విశాలమైన మొహంలో దట్టంగా తీర్చిదిద్దినట్లుండే కనుబొమలు, నవ్వుతున్నపుడు చిత్రంగా మెరిసేకళ్ళు, సొట్టలుపడే బుగ్గలు, తమలపాకుల్లాంటి లేతపెదిమలు...

ఆ విధంగా ఆమె మురిసిపోవటంతో అర్ధమయింది. కారణం– అద్దంలో చూసుకున్న ప్రతి వాళ్ళకి కలిగే భావనలాకాక, ఆమె నిజంగా అందగత్తెకనుక– ఆమె చేతిలో వున్న ఆ అద్దాన్ని కాస్త క్రిందికి దింపితే, శంఖులాంటి పొడుగాటి మెడ, పచ్చని భుజాలు పౌష్టికంగా, నిండుగా కన్పించే ఛాతి, ముడతలు పడని నడుము, అన్నీ కన్పిస్తాయ్.

కాని, ఆమె చేతిలో వున్న అద్దం ఎప్పుడూ మొహం, మెడనిదాటి క్రిందికిరాదు.ఎందువల్లనంటే మొహాన్ని చూసుకొని ఎంతగా మురిసి పోతుందో మెడ దగ్గిరకొచ్చి, అక్కడున్న పసుపుతాడుని చూసుకునేసరికల్లా కల్గిన సంతోషం కాస్తా చప్పున చల్లారిపోయి, దాని స్థానంలో తీరనికోర్కెతాలూకు బాధ పెద్ద బండరాయి లాగామారి గుండెల్లో కూర్చున్నట్లు బరువుగా అన్పించి గట్టిగా నిట్టూర్చి అద్దాన్ని ప్రక్కన వుంచేస్తుంది.

వసంతకి కొన్ని నమ్మకాలున్నాయ్. వాటిల్లో నిజమైన అందం పచ్చదనంలోనే వుందన్న అపోహ. కలర్ కాంప్లెక్సు ఒకటి. పచ్చగా పుట్టటం ఏదో జన్మలో చేసుకున్న పుణ్యఫలమని అలాగే నల్లగా తారుడబ్బాల్లాగా వున్నవాళ్ళందరూ

శాపగ్రస్తులని గట్టిగా నమ్ముతుంది. కాని చిత్రంగా ఆమెభర్త పాపారావు నల్లగా వుంటాడు అప్పటి తండ్రి కుటుంబ పరిస్థితుల దృష్ట్యా అతగాడిని చేసుకోక తప్పిందికాదు. కాని ఆ పాప ఫలం అక్కడితో ఆగక, పుట్టిన ఇద్దరాడపిల్లలు నల్లగానే పుట్టేరు. దాంతో వసంత కొన్ని రోజులు మథనపడి దిగులుపడింది. ఆపైన ఒక జీవితపు సత్యాన్ని అర్థం చేసుకుంది. అది కొన్ని కొన్ని విషయాల్లో రాజీపడి బ్రతకటం నేర్చుకుంటేనే తప్ప జీవితానికి రాణింపుండదని, ఆ విధంగా ఆకళింపు చేసుకున్న ఆ చేదు నిజం మాటున ఎన్నో తియ్యటి కలలు, కోర్కెలు, అనుభూతులు, ఆవేశాలు, అపోహలు మరెన్నిటినో మట్టుపెట్ట గలిగిందిగాని, ఆ ఒక్క కోర్కెని చిన్న వయసులోనే మొలకెత్తి తనతోపాటుగా పెరిగి, మహా వృక్షమై కూర్చున్న ఆ కోర్కెని మాత్రం మట్టుపెట్టి, రాజీపడటం ఆత్మహత్యాసదృశంగా అన్పించింది.

ఆ విధంగా ఆమెలో జనియించి, అమరత్వాన్ని పొందగల్గిన ఆకోర్కె– పచ్చని అందమైన శంఖులాంటి మెడలో రెండు వరుసల చంద్రహారం వేసుకోవాలని, వేసుకుని అద్దంలో చూసుకోవాలని, చూసుకుని మురిసిపోవాలని–

ఆమె స్కూల్లో వున్నప్పుడే ఆకోర్కె తలెత్తింది ఎప్పుడు, ఎక్కడ, ఏ సందర్భంలో తన మనస్సులో అది తళుక్కుమందో తెలీదు గాని, అలా ఒక మధురక్షణంలో మెరిసిన ఆకోర్కె వెంటనే చప్పున చల్లారిపోలేదు. అలాగే నిలబడి, కాలంతో పాటుగా పెరిగి, ప్రకాశవంతమువుతూ ఆమె జీవితానికి పరమార్ధం ఆ ఒక్క కోర్కెని సాధించటం తప్ప మరేమి కాదన్న భావనని కల్గించింది.

తాను మనసు పడుతున్న ఆ గొలుసుని పెళ్ళి సమయంలో, తండ్రి చేయిస్తాడని ఆశపడింది. కాని, బ్రతకలేక బడిపంతులయ్యేడో తను బడిపంతులవటం మూలాన బ్రతకలేక పోతున్నాడో అర్థంకాక సతమతమవుతున్న తండ్రి పరిస్థితి చూసి, గొలుసు మాటని మరచి, అసలు తనకి పెళ్ళి చెయ్యగల్గితే చాలానుకుంది వసంత. కాని అలా తల్లక్రిందులుగా బ్రతుకుతున్న మాష్టారు కన్పించిన ప్రతివాళ్ళకాళ్లు పట్టుకుని, ఎలాగో తంటాలుపడి కూతురి పెళ్ళిని అయిందనిపించారు.

సరే– తండ్రి వల్లకాక పోయినప్పటికి, కనీసం అత్తవారు ఘనంగా కట్నకానుకలు పుచ్చుకుంటున్నారు గనుక వాళ్ళన్నా తన ముచ్చట తీరుస్తారేమోనని ఆశపడింది. బంగారం ఎలాగు పెట్టాలి గనుక, అవి ఇవీ కాకుండా రెండువరుసల చంద్రహారం చుట్టించమని మధ్యవర్తి చేత కబురుగూడా పంపించింది.

ఆరోజు– కుమారి వసంతని శ్రీమతిని చేసిన పెళ్ళిరోజు– అద్దంలో మొహం చూసుకున్నపుడల్లా కలుక్కుమనే ఆరోజు–

సూత్రధారణ పూర్తయింది. బంధుమిత్రుల అభినందన, ఆశీర్వాదాల పరంపరలు పూర్తయినాయి. పాపారావు, ఆమెపై నిహక్కు సంపాదించుకుని ఎదుట కూర్చున్న వాడల్లా వచ్చి ప్రక్కన చేరాడు. పురోహితుడు "పెళ్ళి కుమార్తెకి కట్నాలు చదివింపు" లంటూ అరిచేడు, సిగ్గుతో తలొంచుకుకూర్చున్న వసంత చెవులు నిక్కరించి వినసాగింది. దూరంగా బంధువుల మధ్యన కూర్చుని

కబుర్లు చెపుతున్న ఆమె మావగారు, అక్కడినించే “రెండు పేటల చంద్రహారం” అంటూ రెండు పేటలకి వినిపించేలా తిరిగి కేకపెట్టేడు. ఆ మాటవిన్న వసంతమనసు సంతోషంతో హరివిల్లయింది.

కాని, ఆ కేకల వెనుకనున్న భావం అర్ధం కాని పురోహితుడు “ఎక్కడ – పట్టుకురండి చదివిస్తా” నన్నాడు.

ఆమె మావగారు ఆఖండుడు, వ్యవహారాల్లో ఆరితేరినవాడు. అంచేత ఏమాత్రం చదివించకుండా “ఆర్డరిచ్చాం– ఇంకా తయారవలేదు– లాగించ” మన్నాడు.

పురోహితుడు లాగించేడు.

మావగారు ఆర్డరిచ్చామన్న ఆ గొలుసు కోసం చాలాకాలం ఎదురుచూసింది. తర్వాత భర్త పాపారావుని సిగ్గుపడుతూ సమయం సందర్భం కనిపెట్టి మరీ అడిగింది. ‘గొలుసింకా రాలేదేమని”

ఆ మాటవిన్న అతగాడు పెద్ద జోక్‌విన్న వాడిలా పడీ పడీ నవ్వాడు. భర్త వాలకం అర్ధం కాక అయోమయంగా, భయంగా అతడివంక చూసేది. ఆమె ఆ విషయం ప్రస్తావించినపుడల్లా అతడలాగే నవ్వేవాడుగాని, సమాధానం మాత్రం చెప్పేవాడు కాదు.

అటుపిమ్మట సిగ్గు బిడియం వదిలేసేక (అంటే– కాపురానికొచ్చేక) పాపారావుని గట్టిగా నిలదీసి అడిగింది– అప్పుడు అతడి మొహంలో నిస్సహాయత తెల్లమబ్బులా కనిపించింది.

అప్పుడు వసంతకి విషయం అర్ధమైంది. “ఛీఛీ– ఇంత మోసమా– పదిమంది ముందు గొప్ప కోసం కేకలూ పెడబొబ్బలునూ, అసహ్యంగా” అంటూ చిరాకుని ప్రదర్శించింది.

ఈ విధంగా ప్రతిరాత్రి గొలుసు గొడవ మూలకంగా బంగారంలాటి సమయాన్ని బూడిద పాల్చేస్తున్న భార్యని ప్రసన్నురాలిని చేసుకోవటానికి అతగాడు ఒకరాత్రి వాగ్దానంచేసేడు “నీక్కావలసింది రెండు పేటల చంద్రహారం అంతేగా? సరే– అలాగే కొనుక్కుందువుగానిలే”

వసంత భర్త వాగ్దానం విని, బీటలువారి కూలిపోవనున్న ఆశల గోపురానికి మరమ్మత్తు చేసి నిలబెట్టుకుంది. అభయహస్తమిచ్చాడు గదాని స్థిమితపడింది. కాని అది అభయహస్తం కాదని, కబుర్లుచెప్పి అవుసరాలు తీర్చుకునే శూన్యహస్తమని వూహించలేకపోయింది.

కాలం గుడుస్తోంది. ఆమె ఇద్దరాడపిల్లల తల్లయింది. పిల్లలు పెరుగుతున్నారు– ధరలు పెరుగుతున్నాయి. అంచేత ఖర్చులు పెరుగుతున్నాయి.

ఇంతకాలం గడిచినా, ఇన్ని విచిత్రాలు జరుగుతున్నా వసంత ముచ్చట తీరలేదు. పైగా తీరని ఆ కోర్కె అద్దంలో మొహం చూసుకున్న ప్రతిసారి కఠిన వాస్తవికతలా భయంగా కనిపించి, మనస్సుని దహించి వేయసాగింది.

చివరికి వసంత ఒక నిర్ణయానికొచ్చింది. తనకి ఆ కోర్కె తీరేయోగం లేదని సరిపెట్టుకుంటుండగా పాపారావులో పరివర్తన మొదలైంది. బోసిగా కన్పించే ఆమె మెడని చూసినపుడు, నిరాశనింపుకున్న ఆమె చూపులన్నీ, వైరాగ్యంగా వుండే ఆమె నవ్వుని చూసి అతడు గిల్టీగా ఫీలయి– ఒకరోజు “వసంతా– నీ చిన్ని కోర్కెని గూడా ఎన్నోసార్లు అడిగినా తీర్చలేకపోతున్నందుకు నాకెంతో బాధగావుంది. సరే– ఒక పన్చేద్దాం. ఇంకా కొద్దినెలల్లోనే నేనూ మా చెల్లెలి పెళ్ళికి చేసిన అప్పు తీరిపోతుంది. ఆ వెంటనే మళ్ళీ లోనుకోసం అప్లై చేసి తప్పకుండా నీకు చంద్రహారం చేయిస్తాను. ఒట్టు, నామాట నమ్ము” అంటున్నప్పుడు అతడి మాటల్లో దృఢ నిశ్చయం, నిజాయితీ ధ్వనించాయి.

అటు తర్వాత భార్యకిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని పాపారావు కంకణం కట్టుకున్నాడు అప్పు ఎప్పుడు తీరుతుందాని నెలలు లెక్కపెట్టసాగేడు. అంతలో ఒక సంఘటన జరిగింది.

శిరీష పెద్దమనిషియింది. అంతేకాదు, పదోక్లాసు పాసయ్యి కాలేజీలో చేరింది.

ఇద్దరాడపిల్లల్లో పెద్దది శిరీష. పన్నెండేళ్ళ ఆమెలో యవ్వనం వికసించటం మొదలైంది. ఆమె నల్లగా వున్నప్పటికి, కోలమొహంతోను, విప్పారిన కళ్ళతోను, సాగతీసినట్లుంటే ముక్కుతోను, మొగలిరేకు, సంపెంగ పూవులకి నల్లరంగు ఆపాదిస్తే

ఇలాగే వుంటుందేమోనన్నట్లుగా వుంటుంది. రంగు తండ్రిది, రూపు తల్లిది అయినప్పటికి, వాళ్ళిద్దంలోనులేని గుణం ఆమెలో ఒకటుంది. తనకి కావాలసినదాన్ని నిర్భయంగా అడిగి, అవసరమైతే అలిగి, అల్లరి చేసి సాధించే నేర్పరితనం.

పదోక్లాసు రిజల్ట్సు వచ్చి పాసయినట్టు తెలియంగానే తండ్రినడిగింది. "డాడీ– నాకు మంచి వాచీకావాలి– ఎప్పుడు కొంటున్నారు?" అని వసంత చంద్రహారం అడిగినప్పుడు నవ్వినట్లు నవ్వి "అలాగే చూద్దా"మని తప్పుకో చూసేడు పాపారావు.

"చూద్దాం గీద్దాం అంటే కుదర్దు. నే కాలేజీలో చేరేలోపల కావాలి" అంది మొడిగా.

"సరేలే– చెప్పావుగా వెళ్ళి చదువుకో" అంది వసంత

"మమ్మీ– నేముందే చెప్పానుగా– వాచీలేకుండా కాలేజీకెళ్ళనని– అంతే" అంది నిర్ధారణగా.

ఇక దాంతో వాదించి వుపయోగంలేదని వసంత మౌనంగా వుండిపోయి, రాత్రి పాపారావుతో జరిగిందంతా చెప్పింది.

అతడేమనుకున్నాడో గాని మర్నాడు సాయంత్రం ఆఫీసునుంచి వచ్చేప్పుడు వాచీని తెచ్చి కూతురి చేతికిచ్చాడు. ఎలా తెచ్చాడో, ఏం చేసాడో ఎవరికి తెలీదు.

శరీష మర్నాడు కాలేజీకి వెళ్ళింది.

అప్పటినించి అతడికి కూతురుని చూస్తే బెరుకుగా భయంగా వుండేది. ఏవేళ ఏమడిగి కొంపముంచుతుందోనని తఅఱబెంగ.

చిట్టచివరికి చెల్లెలు పెళ్ళికి పుచ్చుకున్న అప్పు పూర్తిగా తీరిపోయి, తిరిగి లోనుకోసం అప్లై చేసాడు. ఇంకా కొద్దిరోజుల్లో డబ్బు చేతికొస్తుందనగా ఒక రాత్రి భార్యతో "ఇవ్వాళ తిరిగి లోనుకోసం అప్లికేషనిచ్చాను. త్వరలో డబ్బు లొస్తాయ్, రాగానే తెచ్చి నీకిస్తాను. నీక్కావలసిన చంద్రహారం ఆర్డరిచ్చి చేయించుకుంటావో, లేక బజార్లో తయారుగా వున్నది కొనుక్కుంటావో అంతా నీయిష్టం–" అన్నాడు.

వసంత భర్తవంక ఆప్యాయంగా అనునయంగా చూసింది. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఆ శుభ సమయం రానున్నందుకు ఆమె వదనం కళకళ్లాడింది.

మూడురోజులు  తర్వాత, ఒకరోజు రాత్రి పాపారావు భోజనం పూర్తిచేసి తీరిగ్గా పేపరు చూస్తూ కూర్చున్నాడు.

శిరీష చేతిలో పుస్తకంతో రివరివా తండ్రి వద్ద కొచ్చి నిలబడింది. పాపారావు పేపర్లోంచి తలెత్తి ఏవిటన్నట్లు భయంగా చూసేడు.

"డాడీ – మీకో విషయం చెప్పటం మరిచేను. నా కర్జెంటుగా హైహీల్సు చెప్పులు, హ్యాండ్ బ్యాగ్, మంచి పరికిణీ ఓణీలు కావాలి. నా డ్రస్సు అవుతారం చూసి ఫ్రెండ్స్ ఎగతాళి పట్టిస్తున్నారు. అంచేత రేపు సాయంత్రానికల్లా తెచ్చిపెట్టండి అంది చాలా మామూలు ధోరణిలో.

ఆ మాట విన్న పాపారావు చేతిలోంచి పేపరు, ఒంట్లోంచి ఓపిక, గుండెల్లోంచి ధైర్యము ఒకేసారి జారిపోయినాయ్.

ఎదురుదెబ్బతిన్న పిల్లవాడిని ఓదారుస్తున్న తల్లిలా "అదలాగే వాగుతుంది– ఏం పట్టించుకోకండి" అంది వసంత.

నిజాన్ని భరించలేనట్లుగా పాపారావు కళ్లు మూసుకున్నాడు.

మరో రెండు రోజులు గడిచాయి.

తల్లి మందలించినప్పటి నుంచి శిరీష ముభావంగా వుండి తనపన్లు యాంత్రికంగా చేసుకుంటోంది. పాపారావు మరీ ముంగిలా వుంటున్నాడు వసంతకి ఇంట్లో వాతావరణం  కృత్రిమంగాను బాధగాను వుంటోంది.

ఆరోజు రాత్రి పాపారావు లోనుతాలుకు డబ్బు రావటంతో దాన్ని అందంగా కవరులో పెట్టి భార్య చేతిలో వుంచి "పెళ్ళయిన ఇన్నేళ్ళకి నీ ఒక్క కోరికని తీర్చగల్గుతున్నాను. వసంతా అశ్రద్ధచెయ్యక తెల్లవారంగానే బజారెళ్ళి ఆ గొలుసు తెచ్చుకో.

అశ్రద్ధ చెయ్యకు సుమా!" అన్నాడు.

వసంత ఏదో ఆలోచిస్తున్నట్లుగా తలదించుకుంది. దాన్ని సిగ్గుగా అర్థం చెప్పుకున్న పాపారావు ఆమె చుబుకాన్ని ఎత్తిపట్టుకుంటూ "ఇంకో రహస్యం చెప్పనా?" అనడిగాడు.

ఏవిటన్నట్లుగా చూసింది భర్తవంక.

"ఆ చంద్రహారాన్ని వేసుకుని మురిసిపోవాలని నువ్వెంతగా ఆశపడ్డావో దాన్ని నీమెడలో చూచి పరవశించాలని అంతకు రెట్టింపు నేనూ కలలు కంటున్నాను. అంచేత తీరుతున్నది నీ కోర్కెకాదు– నాదిగూడా" అన్నాడు చిలిపిగా.

వసంత అలవోకగా నవ్వింది.

ఆ మర్నాడు పాపారావు హుషారుగా ఆఫీసునించి వచ్చేడు. కాని గడపలోనే ఎదురైన సంఘట చూసి అతడిమనస్సు కీడుని శంకించింది. ముందుగదిలో శిరీష హైహీల్స్ తొడుక్కుని నడక ప్రాక్టీసుచేస్తోంది. అది గమనించిన పాపారావు తనలో మొదలైన భయాన్ని తాను భార్యకిచ్చిన డబ్బుల్లో కాస్తోకూస్తో మిగిల్చి పిల్లదాని ముచ్చట గూడా తీర్చివుంటుందని భాష్యం చెప్పుకుని స్థిమితపడ్డాడు.

కాస్సేపటికి వసంత కాఫీ గ్లాసుతో వచ్చింది.అతడు ఆమె మెడవైపు ఆత్రంగా చూసేడు. కాని అక్కడ ఎప్పటిలాగానే పవిత్రమైన పచ్చతాడు అలాగేవుంది.

అర్థంకాని అతడు అయోమయంగా భార్య వంక చూసేడు.

కాని ఆమె మొహంలో ఎటువంటి ఆందోళన, బాధ కనిపించకపోగా ఏదో ప్రశాంతత, పవిత్రత బంగారంలా మెరుస్తున్నాయి. కాఫీ గ్లాసుని భర్తకందించి,

ఆమె చటుక్కున కదిలి ప్రక్కనే వున్న ట్రంకు పెట్టెలోంచి అందమైన చిన్న అట్టపెట్టెని తీసి భర్తచేతిలో వుంచింది.

అర్థంకాని పాపారావు ఆమె అందించిన పెట్టెని తెరచి చూసేడు. అందులో అతడికి కనిపించింది రెండు పేటల చంద్రహారం కాదు– చక్కటి ఒంటివరస జిగినీ గొలుసు– దాని చివర ముచ్చటైన లాకెట్టు, దానిపైని 'యస్' అనే ఇంగ్లీషు అక్షరం.

అది చూసేక తేరుకునేందుకు అతడికి కొద్ది క్షణాలు పట్టింది. వెంటనే అంటే "నువ్వు చంద్రహారం–" అనబోయాడు.

వసంత మాటని మారుస్తున్నట్లుగా' ఇది శిరీషకోసం తెచ్చేను. దానికి లంగాలు ఓణీలు గూడా తెచ్చేను. ఇంకాస్త డబ్బులు మిగిలితే మీకు రెండు ప్యాంటు గుడ్డలు, ఒక షర్టు పీసులు గూడా తెచ్చేను అంటూ మళ్ళీ పెట్టె తెరచి ఆ బట్టలని అతడిముందు కుప్పలా పోసింది.

అవి చూసేక పాపారావు నల్లటి మోహం మరింత నల్లగామారింది. అంతలో శిరీష కొత్త చెప్పులు టకటకలాడించుకుంటూ వచ్చి "హాయ్ డాడీ– ఆ బట్టలు, గొలుసు లౌలీగా వున్నాయ్ గదూ– థాంక్స్ డాడీ– థాంక్స్" అంది.

పాపారావు అర్థం కానట్లు మొహం పెట్టి భార్యతో "అంటే ఆ డబ్బులు పెట్టి" ఏదో అనబోయాడు.

వసంత మెల్లిగా "అవును ఆ డబ్బులు పెట్టే ఇవన్నీ తెచ్చేను. ఎందుకనంటే–" ఆమె మాట పూర్తికాకముందే పాపారావు చివాలునలేచి బయటకెళ్ళి పోయాడు–

అదేరాత్రి ప్రపంచం సుషుప్తిలో ఆదమరచి పోతుండగా పాపారావు మాత్రం అలాగే శిలా ప్రతిమాలా కూర్చునున్నాడు. అతడి వొడిలో వసంత... "వసంతా ఎందుకిలా చేశావ్?" అన్నాడు నిశ్శబ్దాన్ని ఛేదిస్తున్నట్లు.

ఆమె తల ఎత్తి ఆప్యాయంగా చూసింది. "ఏం – నేచేసింది తప్పంటారా?" అనడిగింది.

పాపారావు భార్యనివొళ్ళోంచి పైకిలాక్కుని ఆమె కళ్ళలోకి చూస్తూ "తప్పనికాదు. కాని, ఇన్నేళ్ళు ఎదురుచూసి తీరా సమయం వచ్చేసరికి ఎందుకిలా చేసావని, అయినా అవన్నీ అప్పుడే దానికేం తొందర?" అన్నాడు.

"శిరీష చిన్నపిల్ల" ఏవేవో కోర్కులు తలెత్తుతాయి. తీరకపోతే పిశాచాల్లాగా జీవితమంతా వెంటాడుతాయి. ఆ బాధ నాకు తెల్సండి. అయినా మనకి వయస్సు మీరి పోతోంది. ఇంకా ఆశలు కోర్కెలు ఏమిటి?" అంది విరాగినిలా.

అది విన్న అతడు ఆమెని మరింతగా దగ్గిరికి తీసుకుంటూ "అవును– వయస్సు మీరిపోతోంది తలపండిపోతోంది– ఒంట్లో ఓపిక సన్నగిల్లుతోంది. జీవన సూర్యుడు పడమటికొండల వైపుగా పరిగెడుతున్నాడు. అందువల్ల మనకేం కోర్కెలు వుండకూడదు– అవునా? ఈ వయస్సులో కోర్కెలు పెంచుకోకూడదు– వాటిని తుంచుకుని చంపుకుంటూ బ్రతకాలి– కదూ– ఎంత పన్చేశావ్ వసంతా?" అన్నాడు.

భర్తమాటల్లోని ఆంతర్యం అర్థంకాక ఆమె అతడికళ్ళలోకి నిశితంగా నవ్వుతూ చూసింది. ఆ నవ్వులో నిండుదనం, చల్లదనం వున్నాయ్.

అలా చూసిన ఆమెకి భర్తకళ్ళలో నీళ్ళు....

ఆమె తన కొంగుతో అతడికళ్ళు తుడుస్తూ "ఛ– వూరుకోండి–" అని అతడికి మరింతగా అతుక్కుపోయింది.

ఆ రాత్రి నల్లగా తారుడబ్బాలాటి భర్త ఆమె కళ్ళకి పచ్చగాను, అందంగాను అవుపించాడు.

అటుతర్వాత వసంత చాలాసార్లు అద్దంలో చూసుకుంది. కాని ఎప్పుడూ బాధపడలేదు.